# గురజాడ అప్పారావు

శ్రీ. శ్రీ.

1909వ సంవత్సరం మే 1వ తారీఖున ఉదకమండలంలోని 'ఎక్కా హిల్ హౌస్'లో కూర్చుని రెండో ముద్రణ కాబోతున్న తన నాటకానికి పీఠిక రాసుకుంటున్నాడాయన. అతని వయస్సు 45 సంవత్సరాలు. ఇంకో ఆరేళ్ళలో అతను విశాఖపట్టణంలో మరణింపబోతున్నాడు. ఉన్ని గుడ్డలు కట్టుకొని శాలువలు కప్పుకొని జాగ్రత్తగా శరీరాన్ని కాపాడుకొంటున్నాడు. అప్పటికే అతన్ని పీడిస్తున్న వ్యాధి అత్యంత తీవ్రరూపం ధరించింది. ఆరోగ్యం కోలుకోడానికే ఉదకమండలం వెళ్ళాడతను. స్థలం ఊటీ, సమయం 1'09 మేడే. రాస్తున్నది కన్యాశుల్కానికి ద్వితీయ ముద్రణ పీఠిక. రాతగాడు గురజాడ అప్పారావు.

ఈ పీఠిక ఇంగ్లీషులో ఉన్నందువల్ల తెలుగు మాత్రమే తెలిసిన ఆంధ్రులనేకులకి అందులో ఉన్న అమూల్య విషయాలు అందిరాక పోతున్నాయి. నాటక రచన, సంఘ సంస్కరణ, వ్యావహారిక భాషా ప్రాశస్త్యం, రచయితలు తాము రాసిన పుస్తకాలు అచ్చువేయించుకోవడానికి పడే పాట్లు, పాఠ్య పుస్తక నిర్ణేతల నిరర్థక నిరంకుశత్వాలు, విశ్వ విద్యాలయాధ్యాపకుల సాహిత్య పరాఙ్ముఖత్వం సమకాలిక విద్వాంసుల ఛాందసాలు ఒకటేమిటి ఎన్నో సంగతులున్నాయి ఆ పీఠికలో.

"తెలుగు దేశంలో గ్రంథకర్త అయినవాడు తన పుస్తకాలు తానే అచ్చొత్తించుకోవాలి. తానే అమ్ముకోవాలి" అని ఆనాడు మహాకవి అన్నమాట ఈనాటికీ యథార్థంగానే ఉంది. అందులోనే అతనింకోమాట అన్నాడు:

"Modern life which presents complex social conditions is neglected by Play-wrights"

అనగా అతి క్లిష్టమైన అనేక సాంఘిక పరిస్థితుల్ని ప్రదర్శించే ఆధునిక జీవితాన్ని నాటక రచయితలెవ్వరూ కథావస్తువుగా స్వీకరించడం లేదు అని. కొద్ది మినహాయింపులతో నాటక రచయితల గతి నాటికీ నేటికీ ఒక్కలాగే ఉంది.

ఆ మరుచటి సంవత్సరం తోక చుక్క కనబడ్డ యేడు బరంపురంలో నానాజాతి సహపంక్తి భోజనం జరిగిన యేడు. మహా కవి గురజాడ అప్పారావు మొట్టమొదటిసారి ముత్యాల సరాలు గుచ్చిన ఏడు. అప్పుడే తెలుగు కవిత్వంలో విప్లవ శకం ఆరంభమైంది.

ఈ విషయాన్నిక్కడ కొంచెం విపులీకరించదలచుకున్నాను. కందుకూరి వీరేశలింగం, తిరుపతి వెంకటేశ్వర కవులు, ఆఖరికి రాయప్రోలు సుబ్బారావు వీళ్లెవ్వరూ కారు ఆధునిక సాహిత్య విప్లవ నాయకులు. ఇప్పుడు చెప్పిన వాళ్ళంతా గురజాడ అప్పారావు కంటె గొప్పవారు కూడాను. కాని, సాహిత్య పరిణామంలో ఈ చెప్పిన నలుగురికీ గురుజాడ అప్పారావుకీ ఉన్న తేడా, సామాజిక వ్యవస్థలో సంస్కరణ ప్రియత్వానికీ, విప్లవ నేతృత్వానికీ మధ్యవున్న భేదంవంటిదే. ఆధునిక సాహిత్యంలో ఆచార్య పీఠం ఎవరిదీ అన్న ప్రశ్నకు కందుకూరి వీరేశలింగంగారిదని కొందరూ, తిరుపతి వెంకటేశ్వర కవులదని కొందరూ రాయప్రోలు సుబ్బారావుదని మరి కొందరూ జవాబిస్తారు. కొన్ని పరిమితమైన ఆవరణలో వీరి జవాబులన్నీ అంగీకరింపదగ్గవే. నిశ్చయంగా కందుకూరి వీరేశలింగం యుగపురుషుడే. తిరుపతి వెంకటేశ్వరులు మార్గదర్శకులే. రాయప్రోలు ఒకానొక కవితా పద్ధతికి ఒరవడి పెట్టినవాడే. అయితే గురజాడలో ఎక్కడుంది విశిష్టత? ఎందులో ఉంది ఆధిక్యం? రాయప్రోలుమీద అభిమానంకొద్దీ ఆయన భక్తులతని కాచార్యత్వం ఇచ్చినట్లు గురజాడ

మీద మూఢ విశ్వాసంతో అతణ్ణి నాయకునిగా అంగీకరిస్తున్నానా లేక వ్యక్తిగతాభిరుచుల కతీతమైన విశేష ప్రామాణ్యాలు మరేవైనా ఉన్నాయా?

ఉన్నాయంటాను నేను. వీటిలో ముఖ్యమైనదీ మొట్టమొదట చెప్పుకోవలసినదీ ఏమిటంటే, ఏ కవికైనా సరే అతని చుట్టూ ఒక సమాజం, ఆ సమాజాని కొక చరిత్రా, ఆ చరిత్రకొక పరిణామం ఉంటాయి. ఈ సామాజిక చారిత్రిక పరిణామ గమనంలో కవియొక్క సాహిత్య స్థానం నిర్ణీత మవుతుంది. కవి ప్రగతిశీలీ, ప్రతిభాశాలీ అయితే ఈ గమనాన్ని అతడు మరింత వేగవంతం చేస్తాడు. సామాజిక పరిణామానికి విప్లవ పంథాలో వేగం సాధించిన మహాకవిగా గురజాడ అప్పారావుకి నేను నమస్కరిస్తున్నాను.

ఇక రెండోది మొదటి అంశంనుండే మొగ్గ తొడుగుతుంది. మొదటిది టెంపోకి సంబంధించిందైతే రెండోది డైరెక్షన్‌కి చెందింది. పరిణామం ఎంత వేగంగా సాగింది అనే కాకుండా ఏ దిక్కుగా సాగింది అని కూడా ఆలోచించాలి. పురోగమనమా పశ్చాద్గమనమా అనే విషయం ఆలోచించాలి. ఇంగ్లండులో టి. ఎస్. ఈలియట్‌ని ఈనాటి మహాకవులలో ఒకడని అందరూ అంగీకరిస్తారు. కాని అతని దృక్పథం మాత్రం అభ్యుదయ నిరోధకం. మన విశ్వనాథ సత్యనారాయణగారున్నారు. ఆయనా అంతే. గ్రీకు రోమన్ కాలాల సంస్కృతి ఈలియట్‌ను ఆకర్షించినట్టే రామాయణ భారత కాలాల వైభవం విశ్వనాథవారిని ముగ్ధుల్ని చేస్తుంది. ఆ వేళకీ ఈ వేళకీ మానవజాతి చాలా ముందంజ వేసిందంటే ఇద్దరూ ఒప్పుకోరనుకుంటాను. ఇందుకు నిదర్శనంగా ఈ కాలపు మానసికాందోళనలను వేలెత్తి చూపిస్తారు. "ఆ పీనుగులు మనలాగే ఏడుస్తూవుండేవారు. మనకంటే అధ్వాన్నంగా వుండేవారు" అనగలిగిన సాహసం అప్పారావుకే చెందింది. దృక్పథాలలోని తేడా యిది. భూతకాలంమీద ఈలియట్‌కున్న అభిమానాన్ని అర్థంచేసుకుంటూనే భవిష్యత్తుమీద గురజాడకున్న విశ్వాసానికి నేనిక్కడ నిరాజనాలెత్తుతున్నాను.

నవ్యాంధ్ర సాహిత్యానికి ఏకైక నాయకునిగా గురజాడ అప్పారావుని నేనంగీకరించడానికి మూడో కారణం భాషకి సంబంధించింది. ఇందాకా నేను చెప్పిన పీఠికలో గురజాడ ఇలా అన్నాడు: "సంకెళ్ళను ప్రేమించేవాళ్లు దాన్ని- అనగా గ్రాంథిక భాషను- ఆరాధిస్తారు గాక. నామట్టుకు నా మాతృభాష సజీవమైన తెలుగు. "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అనిపించుకున్న ఈ తెలుగులో మన సుఖాల్నీ మన దుఃఖాల్నీ వెల్లడించుకోవడానికి మనం యెవరమూ సిగ్గుపడ లేదు గాని కాగితంమీద పెట్టడానికి మాత్రం మనలో కొంతమంది బిడియపడుతున్నారు!" అన్నాడు.

వ్యావహారికాంధ్రం తరఫున గిడుగు రామమూర్తి పంతులు అనాది పండిత లోకంతో సంకుల సమరాలు సాగిస్తూఉంటే శిల్ప ప్రపంచంలో గురజాడ అప్పారావు నూతన సృష్టికి ఉపక్రమించి నూతన విజయాలు సాధించాడు. కన్యాశుల్కం మొదటి ముద్రణ పీఠికలో ఈ విషయమై ఆయన ఇలా రాశాడు:

"It has been remarked that the use of what is wrongly termed the vulgar tongue mars the dignity of a literary production but that is a piece of criticism which one need not heed at the present day when the progress of the science of Language has established better standards for judging the quality and usefulness of tongues than the whims of the grammarians of old linguistic strata."

"గ్రామ్యం అని పొరపాటు పేరుపెట్టి పిలిచే వాడుక భాషను కావ్యరచనలలో ప్రవేశపెడితే ఉత్తమ కావ్యాల కుండవలసిన గౌరవం దిగజారిపోతుందనే విమర్శను మనం లెక్క చెయ్యనక్కరలేదు. ఎందుచేతనంటే కావ్యప్రశస్తీ కావ్యప్రయోజనమూ నిర్ణయించేవి పాతకాలపు వైయాకరణుల ఛాందసాలు కావు. భాషాశాస్త్రవిజ్ఞానం బాగా అభివృద్ధి చెందిన ఈ రోజులలో అంతకన్న మంచి గీటురాళ్లే మన కందుబాటులో కొచ్చాయి."

సినిమాలూ రేడియోలూ అభివృద్ధి చెందిన ఈ రోజులలో జీవద్భాషకు గల ప్రాధాన్యం

మరీ స్పష్టంగా మనకి కనిపించకపోదు. కాని ఆనాడు మొదటిసారిగా అభ్యుదయ మార్గం తీసిన వ్యక్తులు ఎన్నో ఆటంకాల నెదుర్కోవలసి వచ్చింది. కాని వాళ్ళు సువిస్పష్టంగా భవిష్యత్తును చూశారు. భాషాగమనం ఏదిశగా పరుగెత్తుతోందో వారికి తెలుసును. యథాపూర్వ స్థితికోసం పెనగులాడే అభివృద్ధి నిరోధకుల అభ్యంతరాలేవీ వారిని అడ్డడం లేదు. ఈ సందర్భంలో ఒక చిన్న సంఘటన- గురజాడ అప్పారావుగారి జీవితంలోది- ఇక్కడ స్మరించవచ్చును. ఆనంద గజపతి మహారాజు అప్పారావుగారిని విజయనగర సంస్థాన శాసన పరిశోధకునిగా నియమించిన తర్వాత అప్పారావుగారు కళింగదేశ చరిత్రను రాయడానికి కావలసిన సామగ్రినంతా సమకూర్చుకున్నారు. ఆ గ్రంథాన్ని తాము ప్రచురిస్తామనీ, అయితే అది గ్రాంధిక భాషలోనే ఉండితీరాలనీ విజ్ఞాన చంద్రికా గ్రంథమండలివారు కోరగా గురజాడ అప్పారావుగారందు కొప్పుకోలేదు. అప్పుడు ఆయవ అన్న మాట లివి. "నాది ప్రజల వుద్యమం. దానిని ఎవరిని సంతోషపెట్టడానికీ వదలుకోలేను" అని. అంత విశ్వాసం ఉందన్న మాట, ఆయనకి తన ఉద్యమంమీద.

"మాట్లాడినట్టే సరీగ్గా రాయడం కూడా ఎవరికి సాధ్యం? అథవా రాసినప్పటికీ అందులో ఏమి పస ఉంటుంది?" అనేవారికి కన్యాశుల్కంలోని ప్రతీ వాక్యమూ ప్రతీ మాటా తిరుగులేని బవాబిస్తాయి. సామాజిక వాస్తవికతను కన్యాశుల్కం ప్రతిబింబించినంత సంపూర్ణంగా మన దేశంలోని మరే యితర నాటకమూ ప్రతిబింబించలేదని నిస్సందేహంగా చెప్పవచ్చును. సంఘంలోని వివిధ వర్గాలకు, కులాలకు, వృత్తులకు మన, ప్రవృత్తులకు చెందిన ఎందరో వ్యక్తులు నిత్యజీవితంలో తాము ఎలాగ మాట్లాడతారో అలాగే కన్యాశుల్కంలో మాట్లాడతారు. ప్రేక్షకులను మనస్సులో పెట్టుకొని వారిని నవ్వించడానికి కృత్రిమంగా ప్రవేశపెట్టిన సంభాషణలేవీ ఈ నాటకంలో లేవు. గిరీశం, రామప్పపంతులు, పోలిశెట్టి, అసిరిగాడు ఒకరేమిటి ఎవరి గొంతుకయినా ఎక్కడైనా స్పష్టంగా పోల్చుకో వచ్చును. వాస్తవానికి దూరంగా నిలుచుని జీవితానికి మెరుగు పెట్టాలనుకుంటేనే భాషలోకి కృతకత ప్రవేశిస్తుంది. ఈ సందర్భంలో "శిల్పం వాస్తవికతకు అతీతమైనది అని వాదించి ప్రయోజనం లేదు. ఫొటోగ్రాఫీ కళ కాదని పొరపడే వాళ్ళ దృక్పథం ఇది. ఫొటోగ్రాఫీని కూడా ఉత్తమ శిల్పం చేసే నిబంధనలు దీనిలోనే గర్భితమై ఉన్నాయి. గురజాడ సాహిత్యంలో జీవితాన్ని ఫొటోగ్రాఫ్ మాత్రమే కాదు యక్స్‌రే ఫొటోగ్రాఫ్ కూడా తీశాడు.

గురజాడ ఆధిక్యానికి నాలుగో కారణం అతని సార్వజనీనత. తక్కినవాళ్ళంతా తెలుగు దేశంలో యోధానుయోధులైతే ఒక్క గురజాడ మాత్రమే ప్రపంచంలో ఎప్పటి ప్రామాణ్యాలకైనా నిలవగల సార్వజనీనతను సాధించినవాడు. ప్రాచీనాంధ్ర కవులలో వేమన అటువంటివాడు. మళ్లీ ఈనాడు గురజాడ అప్పారావు. తిరుపతి వేంకటేశ్వరుల ప్రతిభను తెలుగుదేశం ఆదరించినంతగా తక్కిన దేశాలు గుర్తిస్తాయని నే ననుకోను. పోతనకవి తెలుగువాళ్ల కర్థమైనంతగా, తెలుగువాళ్లని ఉత్తేజపరిచినంతగా వెలుపలి ప్రపంచానికి కలిసి వస్తాడనుకోను. నూటికి నూరు పాళ్లు తెలుగు కవిగా ఇంట గెలుచుకొని సార్వజనీన సార్వకాలీన విశిష్టత్వంతో రచ్చ గెలువగలిగినవాడు వేమన్న ఒక్కడే వెనుకటి కాలంలో తెలుగుకవి. అలాగే అధునిక సాహిత్య ప్రపంచంలో తెలుగు దేశపు సరిహద్దుల కవతల అంతర్జాతీయ కవి సమ్మేళనంలో తెలుగువారి తరఫున ప్రతినిధిగా నిలుచో గలిగినవాడు గురజాడ అప్పారావు ఒక్కడే. కవిగా మాత్రమే కాదు, కథారచయితగా విమర్శకుడుగా, విశేషించి నాటక కర్తగా గురజాడ ధ్రువతార. అతను రాక ముందు ఉన్న కవిత్వానికీ అతను రాసిన తర్వాత వచ్చిన కవిత్వానికి పోలికేలేదు. అతనికి పూర్వం ఉన్న నాటక రంగానికీ అతని తర్వాత నాటక రంగానికి మశకహస్త్యంతరం ఉంది. కవిగా నాటకకర్తగా గురజాడ ప్రతిభను దేశమంతా గుర్తించింది గాని కథారచయితగా అతనికున్న ఉన్నతోన్నత స్థానం చాలామందికి తెలియదనుకుంటాను. "దేవుడు చేసిన మనుషుల్లారా, మను

షులు చేసిన దేవుళ్లారా మీ పేరేమిటి?" అనే ఒక్క కథానిక చాలును - కథకులలో గురజాడకి అగ్రేసరత్వం స్థాపించడానికి.

ఒకందుకు నాకు విచారం వేస్తుంది. తమిళులు తమ జాతీయ కవిగా సుబ్రహ్మణ్య భారతిని అంగీకరిస్తారు. మళయాళీలకు వల్లథోల్ ఉన్నాడు. వంగీయుల మహాకవి రవీంద్రనాథ ఠాకూరు. అలాగే ఇతర ప్రాంతాలకు ఇతర కవులు. కాని తెలుగులో మాత్రం తమ జాతీయ కవి విషయమై తెలుగువారు ఏకాభిప్రాయానికి రాలేక పోతున్నారు. ఎవరిని గొప్పవాడంటే ఇంకెవరికి కోపం వస్తుందో అనో, విధిలేక ఎవరిగొప్ప వారిది మనము ఎవరము నిర్ణయించడానికి అనో! మళ్లీ కవి పూజలో తెలుగువారు మరే యితర ప్రాంతీయులకూ తీసిపోరు. బహుశా భారత దేశం అంతట్లోకి కవులను హెచ్చుగా ఆరాధించేది తెలుగు దేశమే యేమో కూడా. అయినప్పటికీ రాజకీయాలలో వలెనే సాహిత్యంలో కూడా మనకి బహు నాయకత్వం తప్పలేదు.

# బిచ్చమెత్తడం కూడా నేరమే?

యం. ఆర్. నాగేశ్వరరావు

అమ్మ బువ్వా పెట్టను, అడుక్కు తినా నివ్వను అనే సామెత బీహార్ ప్రభుత్వానికి సరిగ్గా అన్వయిస్తుంది. బిచ్చమెత్తడాన్ని నేరంగా నిర్ణయించి, బిక్షుకులను శిక్షించటానికి బీహార్ ఎసెంబ్లీ శాసనం గావించింది.

ఈ శాసనంతో సమాజంలో చీడపురుగులాగా వ్యాపించిన బిక్షుకవృత్తిని, గారడీవాడు కోడిగ్రుడ్డును మాయం చేసినట్లు మాయం చేయవచ్చునని ప్రభుత్వం తలపోస్తున్నది. ఇంతకంటే వెర్రి వేరే వుండదు.

బిక్షుకవృత్తి ఉండాలని ఎవరూ కోరరు. నిర్మూలనం కావాలనే ప్రతివారూ ఆశిస్తారు. అయితే బిక్షుకవృత్తి నిర్మూలనానికి ఏ విధానాన్ని పద్ధతిని అమలు పరచాలి? అనేది ప్రశ్న. రోగనివారణ చేయటానికి ముందు రోగ కారణాలను ఎట్లా తెలుసుకోవాలో అదే విధంగా బిక్షుకవృత్తి నిరోధించడానికి బిక్షుక సమస్య ఉద్భవించడానికి గల కారణాలు కనుక్కోవాలి. ఆనాడుగాని ఆ సమస్యను పరిష్కరించలేము.

ప్రస్తుతం అమలులోనున్న పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ ప్రసవించిన "రాక్షస సంతానంలో" బిక్షుకవృత్తి ఒకటి. 'లాభంకొరకు ఉత్పత్తి' అనే ఆర్థిక నీతివల్ల ధనరాసులు ఒకవైపు, పేదరికం ఒకవైపు పోగులుపడుతున్నాయి. ప్రజాజీవితం దుర్భరమై పోతున్నది. అసంఖ్యాకమైన నిరుద్యోగ పటాలాలు తయారవుతున్నవి. కేవలం నాలుగు అన్నం మెతుకులు సంపాదించటమే గగనమై పోతున్నది. ఈ పరిస్థితులలో, జీవితం గడవక చేయడానికి ఏవృత్తీ దొరకక అనేకమంది గతిలేక ఆత్మాభిమానాన్ని కుదించుకొని, ఏడుస్తూ, బ్రతుకుమీద ఆశ త్రెంచుకోలేక బిక్షుకవృత్తిని స్వీకరిస్తున్నారు. బిక్షుకవృత్తి, విలాసంకోసం, వినోదం కోసం, సోమరితనం వల్ల అవలంబిస్తున్నారని ఎవరైనా తలపోస్తూంటే మానవత్వాన్నే తక్కువఅంచనా వేస్తున్నారనవలసి వస్తుంది. ఏ మానవుడూ బిక్షుక వృత్తిని సంతోషంతో స్వీకరించడు, 'దేహి'అని ఒకరిముందు చేయిచాచటానికి మానవత్వం తేలిగ్గా అంగీకరించదు. బ్రతికే ఆశలు నిండుకున్నప్పుడు బిక్షమెత్తక ఏమి చేస్తాడు?

బిక్షుకులు ఒకరకంగా సాహసవంతులనే అనాలి. మధ్యతరగతివారు 'డాబుసరిని' హనుమంతుని తోకలాగా పెంచుకొని 'ప్రెస్టీజి' అనే కాల్పనిక జగత్తులో కూర్చుని రోజుల తరబడి పస్తులతో మాడుతున్నా మూగగా భరించి అంతమైపోతున్నారు. ఈ అసమర్థ విషాదాంత జీవితంకన్నా "నాకు తిండిలేదు. నాకు తిండి పెట్టండి" అని అడగటం తప్పా? దొంగతనం చెయ్యటంలాంటిదా? దొంగతనానికి-బిక్షమెత్త